నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, బుధవారం 21 ఆగస్టు 2024 | BHADRADRI KOTHAGUDEM

పోలంబాట వీడి పోరుబాట

ఉధృతంగా మారుతున్న రైతుల ఆందోళనలు

పంటల రుణమాఫీ కోసం ఆర్తనాదాలు

వ్యవసాయ పనులు పక్కన పెట్టి రోడ్డెక్కిన అన్నదాతలు

తహసీల్దార్ ఆఫీసుల ఎదుట ధర్నాలు.. బ్యాంకుకు తాళం

తమను రోడ్డుమీదకు ఈడ్చిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కన్నెర్ర

అన్నదాతలు పొలంబాట వీడి పోరుబాట పట్టారు. జోరుగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డుమీదకు ఈడ్చిందంటూ ఆర్తనాదాలు చేశారు. కొంతమందికే పంటల రుణమాఫీ చేయడంతో మాఫీకాని రైతులు ఆందోళనలను ఉధృతం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం పలుచోట్ల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలకు దిగగా... ఒకచోట ఏకంగా ఏపీజీవీ బ్యాంకుకు తాళం వేసి నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని, రైతులను ఇబ్బందిపెడితే ఏ ప్రభుత్వానికైనా భవిష్యత్ ఉండదని హెచ్చరించారు. వ్యవసాయ పెట్టుబడులకే డబ్బులు లేక చస్తుంటే అప్పు ఎలా కట్టాలని, రూ.2 లక్షల పైన అప్పు కడితేనే రుణమాఫీ అంటే రైతుల ఉసురు తీసినట్టేనని ఆవేదన వ్యక్తం చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అన్నదాతలు రోడ్డెక్కే దుస్థితి రాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేసేవరకు ఆందోళనలు ఆపే ప్రస్తకేలేదంటూ ముక్తకంఠంతో నినదించారు.

– ఖమ్మం, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

రుణమాఫీ కోసం తహసీల్ ఎదుట ధర్నా

కారేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కారేపల్లి, ఆగస్టు 20 : అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన అనంతరం సీపీఎం జిల్లా నాయకుడు భూక్యా వీరభద్రంనాయక్ మాట్లాడారు. రైతులందరి రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతం మందికే మాఫీ చేసి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. రూ.2 లక్షలు తీసుకున్న ప్రతి రైతు రుణం మాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అలాగే రైతుబంధు నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు వారి వెంట ఉండి పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు, కుందనపల్లి నరేందర్, తలారి దేవప్రకాష్, వజ్జా రామారావు, ఏకాంబరం, దాసరి మల్లయ్య, రామారావు, రామచంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రెండు లక్షలు మాఫీ చేయాలి

- లోన్ ఇచ్చినప్పుడు లేని షరతులు మాఫీకెందుకు?
- రైతులకు రుణమాఫీ చేసేవరకు పోరాడుతాం..
- ఇల్లెందు మాజీ ఎమ్మెలే బానోత్ హరిప్రియ

టేకులపల్లి, ఆగస్టు 20 : రైతులందరికీ ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, అర్హులందరికీ రుణమాఫీ చేసే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల తరపున పోరాడతామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ రైతు వేదికలో రెండులక్షలు రుణమాఫీ కాని రైతుల వద్ద నుంచి వ్యవసాయశాఖ అధికారులు తీసుకుంటున్న ఫిర్యాదుల కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. రుణమాఫీ కాని రైతుల పలురకాల సమస్యలను వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని రాజకీయ లబ్ధి పొంది, ఇప్పుడేమో షరతులు పెట్టి రైతులను మోసం చేస్తున్నదన్నారు. బ్యాంకు లోన్ ఇచ్చేటప్పుడు లేని షరతులు రుణమాఫీ దగ్గర ఎందుకని ప్రశ్నించారు. అసలే ఈ ఏడాది సరైన వర్షాలు లేక ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులను రెండు లక్షలకంటే ఎక్కువ ఉన్నవాళ్లు కట్టాలంటే ఎలా కడతారని ప్రశ్నించారు. రైతుల బాధలను గుర్తించి ఎలాంటి షరతులు లేకుండా అర్హులందరికీ రెండు లక్షల మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లెందు నియోజకవర్గ రైతుల తరపున రుణమాఫీ, రైతుభరోసా, రోళ్లపాడు ప్రాజెక్టుకు నీళ్లు అందించి నియోజకవర్గం మొత్తం సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందేవరకు పోరాటం చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు, నాయకులు బానోత్ కిషన్, బర్మావత్ శివకృష్ణ, లాలు, జోగ లక్ష్మణ్, భిక్షం, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాలోత్ శివ, వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

రుణమాఫీ చేయాలంటూ రైతుల రాస్తారోకో

- అధికారి పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆవేదన
- 'సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్' అని నినాదాలు

వేంసూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

వేంసూరు, ఆగస్టు 20 : కాంగ్రెస్ ప్రభుత్వం బేషరతుగా ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిషత్ కారాలయం ఎదుట ప్రధాన రహదారిపై రైతులతో కలిసి బీఆర్ఎస్, సీపీఎం, బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. తొలుత రైతు వేదిక వద్దకు చేరుకున్న రైతులకు మండల వ్యవసాయాధికారి రుణమాఫీపై పొంతన లేని సమాధానం చెప్పడంతో విసుగు చెందిన రైతులు ప్రదర్శనగా రోడ్డుపైకి చేరుకుని బైఠాయించారు. 'సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్' అని నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రుణమాఫీ అమలుపై కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి కంటే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అన్నదాతలు రోడ్డెక్కే దుస్థితి రాదన్నారు. రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతున్నకు సున్నం పెట్టకండి రేవంత్‌రెడ్డి సాబ్ అని అన్నారు. ఆందోళనకు బీజేపీ మండల అధ్యక్షుడు పర్స రాంబాబు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీకి తాళం వేసి రైతుల నిరసన

రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్

రుణమాఫీ కోసం నాగులవంచ ఏపీజీవీబీకి తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చింతకాని, ఆగస్టు 20 : తమకు రుణమాఫీ కావడం లేదని ఆవేదన చెందిన ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన రైతులు ఏపీజీవీబీకి తాళం వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఏపీజీవీబీ పరిధిలో సుమారు 7 గ్రామాలకు చెందిన 200 మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని ఆందోళనతో మంగళవారం బ్యాంకు వద్దకు చేరుకున్నారు. తక్షణమే రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం బేషరతుగా ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుబంధు నగదు విడుదల చేయాలన్నారు. ఏపీజీవీబీ పరిధిలోని ఒక్క గ్రామంలో కూడా 50 శాతానికి మించి రుణమాఫీ జరగలేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కోసం వ్యవసాయాధికారుల కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ సాధారణ రైతులను తిప్పించుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఎలాంటి ఆంక్షలు లేకుండా సాగుచేసే ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రజకసంఘం నాయకులు, రైతులు

మధిర, ఆగస్టు 20 : షరతులు లేకుండా రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని రజకసంఘం మధిర డివిజన్ నాయకులు పాపినేని రామనర్సయ్య, మందా సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిలభారత కిసాన్ సభ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షరతులు లేకుండా రూ.2 లక్షల పైబడిన రుణమాఫీ డబ్బులు జమ చేయాలన్నారు. చనిపోయిన రైతులకు కూడా రుణమాఫీ వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక లోపాలతో నిలిచిపోయిన రుణమాఫీకి సంబంధించిన వారి లోపాలను సవరించి రైతులకు రుణమాఫీ వర్తింప చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చింది. కానీ రుణమాఫీ సగానికి సగంమంది రైతులకు కూడా రైతులను అర్హులుగా ప్రకటించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులందరికీ రుణమాఫీ అందించకపోతే పెద్దఎత్తున ఉద్యమించక తప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు శీలం నరసింహారావు, యువజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దాల ప్రభాకర్, మాదారపు ఉపేంద్ర, పడకంటి మురళి, పుచ్చకాయల కిషోర్, ఊట్ల శంకర్‌రావు, బాజినేని వెంకటనర్సయ్య, అమరవాది మోహన్‌రెడ్డి, మోహన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

రుణమాఫీ అన్నారు.. కానీ మాఫీ చేయలేదు..

మాకు మొత్తం నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నా పేరు మీద రెండు ఎకరాలు. నా కొడుకు పేరు మీద మరో రెండు ఎకరాలు ఉంది. కొన్నేళ్లుగా మిర్చి సాగు చేస్తున్నాం. ఇందుకోసం ఇద్దరమూ కలిసి బ్యాంకు నుంచి పంట రుణం తీసుకున్నాం. రూ.2 లక్షల వరకూ ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తామని ఇటీవల సీఎం చెప్పారు. మూడేళ్లుగా ఎండు తెగులు సోకి పంటల దిగుబడి తగ్గుతోంది. ఈ క్రమంలో మా పంట రుణం మాఫీ అయితే మాకు కొంతైనా మేలు జరుగుతుందని అనుకున్నాం. కానీ మూడు విడతల్లోనూ మా పంట రుణాలు మాఫీ కాలేదు. మాకు పట్టాదారు పాస్‌బుక్కులు వేర్వేరు ఉన్నాయి. రేషన్ కార్డు ఒక్కటే ఉంది. రూ.2 లక్షల కంటే ఎక్కువగా రుణం ఉందని మాకు రుణమాఫీ చేయలేదు. **–మారుతి నర్సింహారావు, శాంతినగర్, టేకులపల్లి**

ఆశలు సన్నగిల్లాయి...

నాకు ఐదెకరాల 20 కుంటల భూమి ఉంది. యూనియన్ బ్యాంకులో లక్షా 70వేలు రుణం తీసుకున్నా. సహకార బ్యాంకులో 70వేలు తీసుకున్నా. మొత్తం 2.40 లక్షల రుణం ఉంది.. రెండు లక్షల వరకు మాఫీ చేస్తానన్నారు. పైన 40వేలు కట్టుకుంటాము మిగతావి మాఫీ చేయండని బ్యాంకువాల్లని అడిగితే మీది రుణమాఫీ అవ్వలేదని సమాధానం ఇచ్చారు. వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం చెప్పేదొకటి చేసేది మరొకటి... రుణమాఫీపై ఆశలు సన్నగిల్లాయి. డబ్బులు మాఫీ అయితే అప్పులు తొలిగి పోతాయనుకుంటే చివరికి నిరాశే మిగిలింది.

– సడియం వీరస్వామి, ములుగూడెం, చుంచుపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

హామీలు అమలు చేయట్లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షలకు పైగా ఉన్న డబ్బులు కడితేనే రుణమాఫీ అవుతుందని కొర్రీలు పెడుతోంది. గత కేసీఆర్ ప్రభుత్వం ఒకసారి రైతుకు ఎన్ని లక్షలు అప్పు ఉన్నా రూ.లక్ష మాఫీ చేసింది. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా షరతులు లేకుండా రూ.2 లక్షలు మాఫీ చేస్తే బాగుంటుంది. నేను తీసుకున్న మొత్తానికి వడ్డీతో కలిపి రూ.2,00,908 కట్టాలన్నారు. జాబితాలో పేరున్నా రుణమాఫీ కావట్లేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పని కావట్లేదు. తిరగడానికే రోజులు గడుస్తున్నాయి.

–చిట్టూరి నాగేశ్వరరావు, రైతు, వేంసూరు

షరతులు విధించడం సరికాదు..

ప్రభుత్వం రైతుల రుణమాఫీకి షరతులు విధించడం సరికాదు. ఎటువంటి షరతులు లేకుండా రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు కండీషన్లు పెట్టడం బాధాకరం. రూ.2 లక్షల పైన ఉన్న రుణాలను చెల్లించాలంటే రైతులకు భారంగా మారుతుంది. పంట పెట్టుబడికి ఇంతవరకు రైతు భరోసా ఇవ్వకుండా ఇప్పుడు పై రుణాలను చెల్లిస్తేనే రుణం మాఫీ చేస్తామనడం విడ్డూరంగా ఉంది. రూ.2 లక్షలు పైన ఉన్న రైతులందరికీ నిబంధనలు లేకుండా పంట రుణాలు మాఫీ చేయాలి.

– వీరబోయిన వెంకటేశ్వర్లు, రైతు, మర్రిగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

మాఫీపై కొర్రీలు పెట్టొద్దు..

అన్ని పత్రాలు ఇచ్చి బ్యాంకుల్లో రుణం తీసుకున్నాం. రుణం తీసుకునేప్పుడు అవసరం లేని రేషన్ కార్డు నిబంధన ఇప్పుడు ఎందుకు పెట్టారు. రూ.2 లక్షలకు పైగా రుణాలున్న వారి అర్హుల జాబితాను పూర్తిస్థాయిలో వెంటనే ప్రకటించాలి. రూ.2 లక్షల పైబడి ఒకటికి మించి బ్యాంకుల్లో రుణాలుంటే వారి పరిస్థితి ఏమిటి? ఇటువంటి గందరగోళ ప్రశ్నలు రైతుల్లో ఎన్నో ఉన్నాయి. వాటిని నివృత్తి చేయాలి.

–కూకలకుంట రవి, రైతు, ముష్టిబండ, దమ్మపేట మండలం

చేస్తే అందరికీ చేయాలే...

ప్రభుత్వం రుణమాఫీ అని చెప్పి కొంతమందికే మాఫీ చేస్తే ఎట్లా? మా లాంటి వారి పరిస్థితి ఏందిమరి? మాకు యూనియన్ బ్యాంకులో రూ.93 వేలు రుణం ఉంది. మొన్న బ్యాంకుకు పోయి అడిగితే అవ్వలేదు మీది అన్నారు. ఎక్కడికిపోయి అడిగినా పట్టించుకునేవారే లేరు. ఏవో మేడంను అడిగితే ఇంకా మాకే దిశా నిర్దేశాలు రాలేదు మీకేమి చెప్పాలి అని మొఖం చాటేస్తున్నారు. రైతులకు మేలు చేయాలనే ఆలోచన ఉంటే ఇలా జరగదు.

– పటాన్ అబిదున్నీసాబేగం, పెనగడప, చుంచుపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

చంద్రుగొండ రైతు వేదిక ఎదుట రైతుల నిరసన

చంద్రుగొండ రైతు వేదిక ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

చంద్రుగొండ, ఆగస్టు 20 : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ చంద్రుగొండ రైతు వేదిక ఎదుట రైతులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి అందరు రైతుల రుణమాఫీ చేశామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా.. మాఫీ అయ్యింది నూటికి పాతిక మందికి మాత్రమేనని ఆరోపించారు. అందరి రుణాలు మాఫీ అయితే.. రైతు వేదికల్లో ప్రభుత్వం ప్రజావాణి ఎందుకు పెట్టిందని వారు ప్రశ్నించారు.

ఏజెన్సీ రైతులకు ఎక్కువగా పట్టాదారు పుస్తకాలు, రేషన్ కార్డులు లేవని, ఈ విషయం పాలకులకు తెలియదా అని ప్రశించారు. గానుగపాడు సొసైటీలో 2,850 మంది రైతులకు.. కేవలం 850 మందికే రుణమాఫీ అయ్యిందన్నారు. మిగతా రైతుల రుణాలు మాఫీ అయ్యే వరకు దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రైతులను ఏడిపిస్తున్నారు..

రైతులను ఈ ప్రభుత్వం ఏడిపిస్తోంది. రుణమాఫీ కోసం రైతులు రైతు వేదికలు, బ్యాంకులు, సొసైటీల చుట్టూ తిరుగుతున్నారు. రేషన్ కార్డు లేదని, పట్టాదారు పాస్‌పుస్తకం లేదని, కుటుంబంలో ఒకరికంటే ఎక్కువ మంది రుణం తీసుకున్నారని తిప్పుకుంటున్నారు. రైతుల ఉసురు ఈ ప్రభుత్వానికి తప్పక తగులుతుంది. రైతులను ఇలా తిప్పుకోవడం సరికాదు.

–చలమల ఆదినారాయణ, రైతు, అయ్యన్నపాలెం, చంద్రుగొండ మండలం

ఆర్‌వోఆర్ చట్టంపై చర్చకు రండి..

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : నూతన ఆర్వోఆర్ చట్టంపై చర్చించేందుకు అవగాహన కలిగిన రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఐడీవోసీలో ఈ నెల 24న జరిగే సమావేశంలో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రావొచ్చని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ధరణి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకున్న నూతన ఆర్వోఆర్ చట్టం–2024పై సలహాలు, సూచనలు ఇచ్చేవారు 3 గంటలకు జరిగే సమావేశంలో పాల్గొనాలని కోరారు. కేవలం ఆర్వోఆర్ చట్టంలోని అంశాలనే చర్చించాలని, ఏమైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం

మహేశ్ (ఫైల్)

నవీన్ (ఫైల్)

ఖమ్మంరూరల్, ఆగస్టు 20 : ఖమ్మం జిల్లా ఖమ్మంరూరల్ మండలంలోని మద్దులపల్లి గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు(కవలలు) దుర్మరణం చెందారు. మండల పరిధిలోని రామన్నపేట గ్రామానికి చెందిన అత్తునూరి నర్సింహారావు హమాలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. నర్సింహారావు దంపతులకు ఇద్దరు కుమారులు(కవలలు) అత్తునూరి మహేశ్(22), అత్తునూరి నవీన్(22) ఉన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అన్నదమ్ములు పోటీ పరీక్షలకు ఇంటివద్దనే ఉంటూ ప్రిపేర్ అవుతున్నారు. వీరి స్నేహితుడితో కలిసి ముగ్గురు ఒకే బైక్‌పై కూసుమంచి వైపు వెళ్తున్నారు. మద్దులపల్లి గ్రామ శివారులోకి చేరుకునే సమయంలో మూలమలుపు వద్ద వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో నవీన్, మహేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. మరో యువకుడిని స్థానికులు, పోలీసుల సహాయంతో ఖమ్మం వైద్యశాలకు తరలించి చికిత్స అందజేస్తున్నారు. మహేశ్, నవీన్ మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు. చేతికి అందివచ్చిన కొడుకులు మృతిచెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

3 నెలల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్ర పరిశీలన పూర్తికి చర్యలు

ఐదు రోజులు భారీ వర్షాలున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలి

'ధరణి' పెండింగ్ దరఖాస్తుల సమస్యలు పరిష్కరించాలి

వీసీలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సకాలంలో స్క్రూట్నీ చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

మామిళ్లగూడెం, ఆగస్టు 20: రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రూట్నీ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని తాత్కాలికంగా నియమించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఎల్ఆర్ఎస్, భారీ వర్షాలు, ధరణి, ఆర్‌వోఆర్ చట్టం తదితర అంశాలపై హైదరాబాద్ సచివాలయం నుంచి సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు, జిల్లాల్లోని కలెక్టర్లతో మంగళవారం ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఆయన పాల్గొని మాట్లాడారు. దాదాపు 20 లక్షలకుపైగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నందున మార్గదర్శకాల ప్రకారం కలెక్టర్లు శ్రద్ధ చూపి వాటిని మూడు నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను సేకరించి జీపీఎస్ ద్వారా యాప్‌లో నమోదుచేయాలని సూచించారు. అదే సమయంలో ఈ భూములు నీటి వనరుల బఫర్ జోన్లు, నాలా, చెరువులు, చారిత్రక కట్టడాలు, రక్షణ భూముల వంటి వాటి పరిధిలోవి కావని ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ద్వారా ఎక్కడా ప్రభుత్వ భూమికి నష్టం కలగవద్దని ఆదేశించారు. అలాగే, రాబోయే ఐదు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలన్నారు. తిరస్కరించే దరఖాస్తులకు కారణాలను తెలియజేయాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును ప్రతిపాదించిందని అన్నారు. దీనిపై ఈ నెల 23, 24 తేదీల్లో జిల్లాలో వర్క్‌షాపులు నిర్వహించాలని, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శికి మార్పులు, మెరుగైన సూచనలపై ఫీడ్‌బ్యాక్ అందించాలని సూచించారు. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పాల్గొన్నారు.